
మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
గురువారం | 24 | జూలై | 2025 | పేజీలు: 5






## ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్త జనం



2 లో

# విశాఖకు ప్రతిష్టాత్మక సంస్థలు



భవిష్యత్ పెట్టుబడులకు, అవసరాలకు తగ్గట్లుగా విశాఖ మాస్టర్ ప్లాన్

విశాఖ ఖ్యాతి మరింతగా పెరుగుతుంది

ముందస్తు ప్రణాళికలతో అధికారులు పనిచేయాలి

సీఎం చంద్రబాబు నాయుడు

- విజయవాడ పశ్చిమ, మనం న్యూస్

2 లో

## డేటా విప్లవంతో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుంటాం



2 లో

పరిపాలనలో ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు.

ఇన్వెస్టోపియా - ఆంధ్రప్రదేశ్ సదస్సులో మంత్రి నారా లోకేష్.

## ఏఐతో బీసీ హాస్టళ్ల పర్యవేక్షణ



2 లో

- త్వరలో యాప్ రూపొందించనున్నట్లు వెల్లడి
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

## ఉపాధి హామీలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



3 లో

- పనితీరు సరిగా లేని ఫీల్ అసిస్టెంట్లకు షోకాజు నోటీసులు

-ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

నదీ తీర ప్రజలు

## అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు



5 లో



విజయవాడలో బుద్ధునితో

## నా ప్రయాణం నాటక ప్రదర్శన

5 లో

# డేటా విప్లవంతో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుంటాం

- పరిపాలనలో ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు
- ఇన్వెస్టోపియా - ఆంధ్రప్రదేశ్ సదస్సులో మంత్రి నారా లోకేష్



**విజయవాడ తూర్పు, జూలై 23 (మనం న్యూస్) :** డేటా విప్లవం ద్వారా అంతర్జాతీయంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలుస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. విజయవాడ నోవాటెల్ హోటల్ లో ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు ఆధ్వర్యాన జరిగిన ఇన్వెస్టోపియా గ్లోబల్ - ఆంధ్రప్రదేశ్ సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐ, డాటా సెంటర్లపై జరిగిన చర్చలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ సౌత్ ఏషియాలోనే తొలి 152 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఎపి రాజధాని అమరావతిలో జనవరిలో ఆవిష్కృతం కాబోతోంది. ఇది యావత్ ఎకో సిస్టమ్ ను మార్చబోతుంది. విశాఖపట్నం డేటా సిటీగా అభివృద్ధి చెందుతోంది. అంతర్జాతీయంగా పలు ప్రఖ్యాత సంస్థలో విశాఖలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటివరకు సాంప్రదాయ విద్యావిధానం కొనసాగుతున్న నేపథ్యంలో ఎఐ వంటి అధునాతన సాంకేతికతకు ట్రాన్స్‌ఫార్మేషన్ కష్టతరమైన పనే. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యలో ఎఐ స్కిల్ డెవలప్ ప్రోగ్రామ్ లను ప్రవేశపెడుతున్నాం. ఎఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి పాఠ్యాంశాలతో కరిక్యులమ్ లో సమూల మార్పులు తెస్తున్నామన్నారు. రోజువారీ పరిపాలనలో ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. పాదయాత్ర సమయంలో ప్రజలు సాధారణ ల్యాండ్ రికార్డుల కోస ఇబ్బందులు పడటం నేరుగా గమనించాను. అందుకోసం ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు సులభతరమైన పౌరసేవలు అందించడంపై దృష్టిసారించామన్నారు. మనమిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రవేశపెట్టి 600 రకాల పౌరసేవలను ప్రజలకు వేగవంతంగా అందిస్తున్నామన్నారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వశాఖలను అనుసంధానిస్తూ అతి పెద్ద బ్యాక్ ఎండ్ డేటా లేక్ ను తయారుచేశామన్నారు. ఎఐ సాంకేతితను అందిపుచ్చుకోవడంలో మేం యుఎఈని ఆదర్శంగా తీసుకుంటున్నాం. ప్రపంచంలో తొలిసారిగా ఎఐ మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసిన దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. యుఎఈ ట్రాఫిక్ క్రమబద్దీకరణలో ఎఐ సాంకేతికతను వినియోగిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కారణంగా ఉద్యోగావకాశాలు కోల్పోతామన్న కొందరి వాదనతో నేను ఏకీభవించను. ప్రతి పారిశ్రామిక విప్లవం కొత్త ఉద్యోగాలు సృష్టిస్తుందని నేను నమ్ముతాను. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భవించబోతోంది. జి టు జి కొలాబరేషన్ లో భాగంగా యుఎఈ - ఆంధ్రప్రదేశ్ పరస్పర సహకారం ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేయాలని మేం భావిస్తున్నాం. ఎఐ, డేటా సెంటర్లు, డిజిటల్ ఆవిష్కరణలు, స్మార్ట్ గవర్నెన్స్ ద్వారా ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే మార్గాలను అన్వేషిస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఫైర్ సైడ్ చాట్ లో తనకు ఇష్టమైన ఎఐ అప్లికేషన్ చాట్ జిపిటి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి జి42 ఇండియా సిఇఓ మనుజైన్ హాజరుకాగా, ప్రైమస్ పార్టనర్స్ వైస్ ప్రెసిడెంట్ రక్ష శ్రద్ధ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రెన్యువబుల్ ఎనర్జీ, ఇన్ ఫ్రా, డిజిటల్ గవర్నెన్స్, ఎఐ ఫస్ట్ యూనివర్సిటీ, జీనోమ్ సీక్వెన్సింగ్, క్వాంటమ్ వ్యాలీ, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి యుఎఇ ఆర్థిక మంత్రి అబ్దుల్ బిన్ తక్ ఆల్ మరితో మంత్రి లోకేష్ చర్చించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు యుఎఇ తరపున సహకారం అందించాల్సిందిగా కోరారు. దీనికి అబ్దుల్ బిన్ స్పందిస్తూ యుఎఈ పర్యటనకు రావాల్సిందిగా మంత్రి లోకేష్ ను ఆహ్వానించారు.

# ఏఐతో బీసీ హాస్టళ్ల పర్యవేక్షణ

మొదటి పేజీ తరువాయి...

**విజయవాడ తూర్పు, జూలై 23 (మనం న్యూస్):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా బీసీ హాస్టళ్ల పర్యవేక్షణ చేపట్టనున్నామని, త్వరలోనే దీనికి సంబంధించిన యాప్ రూపొందించనున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏఐతో బీసీ హాస్టళ్ల జవాబుదారీతనం మరింత పెరగనున్నట్లు వెల్లడించారు. వచ్చే నెల 30లోగా హాస్టళ్లకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదరణ 3.0 ద్వారా కుల వృత్తుదారులకు ఆధునిక పరికరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్ లో బుధవారం ఆయా జిల్లాల బీసీ సంక్షేమ శాఖాధికారులు, డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. ముందుగా బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల నిర్వహణ తీరుతెన్నులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ వివరించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల అయిదో తేదీలోగా అడ్మిషన్లు పూర్తి చేయాలని స్పష్టంచేశారు. ముఖ ఆధారిత గుర్తింపు(ఫేషియల్ రికగ్నిషన్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ - ఎఫ్ఆర్ఎస్) ద్వారా విద్యార్థుల హాజరులో ఆటంకాలు ఏర్పడితే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కారించుకోవాలన్నారు. వచ్చే నెల అయిదో తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం మేర అడ్మిషన్లు పూర్తి చేయాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.

## హాస్టళ్లలో రాత్రి బస చేయాల్సిందే...

బీసీ హాస్టళ్ల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగానే గతం ప్రభుత్వం పెట్టిన డైట్ బిల్లుల బకాయిలు చెల్లించడమే కాకుండా, ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. హాస్టళ్లలో రాత్రి సమయాల్లో హెచ్ డబ్ల్యూవోలు ఉండాలని స్పష్టంచేశారు. హాస్టళ్ల పనితీరు మరింత మెరుగుపడాలంటే నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. మంత్రిగా తాను అన్ని జిల్లాల్లో ఉన్న బీసీ హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను ఎప్పకటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలు తరుచూ హాస్టళ్లను సందర్శించాలని, వీలైతే రాత్రి బస కూడా చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి టూర్ డైరీ రూపొందించాలని, ఆ డైరీని ప్రతి నెలా అయిదో తేదీలోగా రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని తెలిపారు. హెచ్ డబ్ల్యూఎస్ లు రాత్రి సమయాల్లో హాస్టళ్లలో తప్పనిసరిగా బస చేయాల్సిందేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. విద్యార్థులను బాధ్యతతో సొంత బిడ్డల మాదిరిగా చూసుకోవాలన్నారు. సన్న బియ్యం భోజనంతో విద్యార్థుల ఆనందంగా కడుపు నింపుకుంటున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టామని మంత్రి సవిత వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.13 కోట్లు వెచ్చించిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో పలు హాస్టళ్లలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు ఆగస్టు 30వ తేదీ నాటికి పూర్తి చేయాలన్ని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు బిల్లులు అందజేయాలని, దీనివల్ల నిధులు త్వరితగతిన మంజూరు చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

## ఏఐతో హాస్టళ్ల పర్యవేక్షణ.

బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, హాస్టళ్ల జవాబుదారీ తనం మరింత పెంచేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను వినియోగించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఏఐ ద్వారా మెనూ అమలు, పరిశుభ్రత పర్యవేక్షణ, విద్యార్థులు, సిబ్బంది హాజరు వంటి అంశాలను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఏఐతో హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు భద్రతతో కూడిన విద్య అందించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

## పీ-4తో హాస్టళ్ల దత్తత...

సీఎం చంద్రబాబునాయుడు స్ఫూర్తితో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి పీ4 మోడల్ అమలు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. మార్గదర్శకులను గుర్తించి, బీసీ హాస్టళ్లను దత్తత ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. హాస్టళ్లలో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి తమవంతు సాయంగా ముందుకొచ్చే దాతలను గుర్తించాలని మంత్రి సవిత సూచించారు. దాతల ద్వారా సీఎస్ఆర్ నిధులు సేకరించాలన్నారు. బీసీ హాస్టళ్ల అభివృద్ధికి ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలని డీబీసీడబ్ల్యూఈవోలను, ఏబీసీడబ్ల్యూఈవోలను మంత్రి సవిత ఆదేశించారు. కుల వృత్తుదారులకు ఆధునిక పరికరాల అందజేసి, వారి పెంచడానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి సవిత తెలిపారు. లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక పరికరాలను ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం రూ.1000 కోట్లు మంజూరు చేసిందన్నారు. మహిళలకు అందజేస్తున్న ఉచిత కుట్టు శిక్షణ విజయవంతం కావడంపై మంత్రి సవిత సంతృప్తి వ్యక్తంచేశారు. త్వరలోనే మహిళలకు కుట్టు మిషన్లు అందజేయబోతున్నామన్నారు. కేవలం కుట్టు మిషన్లు ఇవ్వడంతోనే సరిపెట్టకుండా, వారు తయారు చేసే దుస్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని బీసీ కార్పొరేషన్ అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, 26 జిల్లాలకు చెందిన డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలు, ఎంజేపీ స్కూళ్ల కన్వీనర్లు, బీసీ కార్పొరేషన్ ఈడీలు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖకు ప్రతిష్టాత్మక సంస్థలు

మొదటి పేజీ తరువాయి...

**విజయవాడ పశ్చిమ, జూలై 23 (మనం న్యూస్):** ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలైన సిఫీ, సత్వా, బివిఎం, ఎఎన్ఎస్ఆర్ సంస్థలు రూ.20,216 కోట్ల పెట్టుబడులకు ముందుకు రాగా ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగిన 9వ ఎస్ఐపిబి సమావేశం ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా 50,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ సందర్భంగా 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్ కమిటీకి చైర్మన్గా ఉన్న నారా లోకేష్ సమావేశంలో ఆయా పెట్టుబడులు గురించి వివరించారు. ప్రతిష్టాత్మక సంస్థల రాకతో విశాఖ ఖ్యాతి మరింతగా పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడులపై ఆయా సంస్థలతో జరిపిన చర్చలు, వాటి స్థితిగతులు, బలా బలాలు వెల్లడించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ... భవిష్యత్ పెట్టుబడులకు, అవసరాలకు తగ్గట్లుగా విశాఖ మాస్టర్ ప్లాన్ ఉండాలని అన్నారు. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని... ఇప్పటికే అర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ సహా అనేక సంస్థలకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో విశాఖకు వచ్చే సంస్థలకు అనువైన భూమిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక వసతుల సమస్యలు రాకుండా ప్రణాళికలు అమలు చేయాలని సిఎం ఆదేశించారు. పూణె, బెంగుళూరు వంటి పట్టణాల్లో ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్యలను ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించగా... అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. విమానాశ్రయం-రైలు కనెక్టవిటీ, హైవే రోడ్లు, మెట్రో వంటి వాటిపై ముందస్తు ప్రణాళికలతో అధికారులు పనిచేయాలన్నారు. పూణె, బెంగుళూరు వంటి చోట్ల నేడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మన దగ్గర తలెత్తకుండా చూడాలన్నారు. కంపెనీలను ఏర్పాటు చేయడంతో పాటు సామాన్య ప్రజలు ఆయా ప్రాంతాల్లో నివసించడానికి అవసరమైన ఎకో సిస్టం కూడా ఉండాలనే విషయాన్ని గుర్తుపెట్టుకుని ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అన్నారు.

## వివిధ కంపెనీల పెట్టుబడుల వివరాలు.

1. సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో మొదటిదశలో రూ.1,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 200 మందికి ఉపాధి లభించనుంది. రెండవదశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు... 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. 2. సాత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం-మధురవాడలో రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెడుతుండగా, 25,000 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. 3. బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం-ఎండాడలో రూ.1,250 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 15,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. 4. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం-మధురవాడలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తద్వారా 10,000 ఉద్యోగావకాశాలు వస్తాయి. సిఫీ : సిఫీ టెక్నాలజీస్ ప్రముఖ ఐటీ కంపెనీలలో ఒకటి. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించి సొల్యూషన్స్, సర్వీసెస్ ప్రొవైడర్గా పనిచేస్తుంది. సిఫీ టెక్నాలజీస్ లిమిటెడ్ రూ.3,621 కోట్ల టర్నోవర్, సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ రూ.1,114 కోట్ల టర్నోవర్ కలిగివుంది. రెండు ప్రాజెక్టులుగా వివిధ దశల్లో ఏపీలో తమ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది అక్టోబర్లో కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రెసిడెన్షియల్, కమర్షియల్ ఐటీ, ఐటీఈఎస్ పార్కులకు సంబంధించిన ప్రాజెక్టులను అభివృద్ధి చేయడంలో అనుభవం ఉంది. ప్రస్తుతం 8 నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సత్వా... 80 మిలియన్ చదరపు అడుగుల మేర కార్యాలయ సముదాయాలను నిర్మిస్తోంది. బీవీఎం : కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీ, రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విశాఖలో మినీ స్మార్ట్ టెక్ సిటీ ఏర్పాటు చేయనుంది. గ్రేడ్ ఏ ప్లస్ ఆఫీస్ స్పేస్, కోవర్కింగ్ స్పేస్, ఎంప్లాయి రెసిడెన్సెస్ వంటివి ఏర్పాటు చేయనుంది. కపిల్ గ్రూపు సంస్థకు గతంలో ఫైనాన్సియల్ సర్వీసెస్, స్టార్ హోటల్స్, ఐటీ పారక్స్ నిర్మాణంలో అనుభవం ఉంది. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజైనింగ్, ఎస్టాబ్లిషింగ్, జీసీసీ ఆపరేటింగ్లో మార్కెట్ లీడర్గా ఉంది. ఇండియాతో సహా పోలాండ్, యూఏఈలో కూడా కార్యకలాపాలు సాగిస్తోంది. లక్షా 50 వేల మంది ఉద్యోగులతో ఉన్న 12 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ సముదాయం కలిగిఉంది. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 113 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో పారిశ్రామిక రంగానికి చెందిన 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41 ప్రాజెక్టులు, పర్యాటక రంగలో 11, ఐటీలో 11, ఫుడ్ ప్రాసెసింగ్ 4 పరిశ్రమలకు చెందిన పెట్టుబడులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,94,454 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 5,56,568 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్త జనం



**విజయవాడ పశ్చిమ, జూలై 23 (మనం న్యూస్):** అమ్మలగన్నయమ్మ కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి ఆషాఢ సారె సమర్పణ నిమిత్తం ఆలయంనకు వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులతో ఇంద్రకీలాద్రి కళ కళ లాడింది. ఇంటి ఆడపడుచుకు ఏ విధంగా సారె సంభారములు పెడతారో అంతకంటే శ్రద్దగా, భక్తి తో భక్త బృందాలు సామాగ్రి తో ఆషాడ మాసం మొత్తం తరలి వచ్చారు. గురువారం చివరి రోజు ఉదయం 7 గంటలకు ఆలయ కార్యనిర్వహణా ధికారి వి కే శీనానాయక్ వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు, వైదిక కమిటీ, వేద పండితులు, అర్చక మరియు పరిచారక స్వాములుచే చివరి రోజు ఘనంగా ఆషాఢ సారె సమర్పిస్తారు. ఆషాఢ మాసం చివరి రోజు ఆలయ అర్చకులు సమర్పించే సారెతో ఈ సంవత్సరం సారె సమర్పణ కార్యక్రమం ముగుస్తుందని, రేపు సాయంత్రం వరకు సారె తీసుకురావచ్చునని, అనంతరం నెల రోజులు మహా మంటపంలో కొలువై పూజలందుకున్న అమ్మవారి మూర్తి ప్రధాన ఆలయం చేరుకుంటుందని అర్చకులు తెలిపారు.

# పీ4లో మహిళా పారిశ్రామికవేత్తలు భాగస్వాములుకండి

- ఫిక్కీ మహిళల మార్గదర్శనంతో బంగారు కుటుంబాలకు ఆసరా
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ సెంట్రల్, జూలై 23 (మనం న్యూస్):** ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదలకు ఆసరాను అందించి, జీవితంలో స్థిరపడేలా ఫిక్కీ మహిళాపారిశ్రామికవేత్తలు మార్గదర్శకులుగా నిలవాలని.. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో అమలుచేస్తున్న పీ4 విధానంలో భాగస్వాములుగా ముందుకురావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్వో)- విజయవాడ ప్రతినిధులతో బుధవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్లో పీ4 విధానం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, 2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో పీ4 విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పేదలు పూర్తిస్థాయిలో పేదరికం నుంచి బయటపడలేకపోతున్నారనే విషయాన్ని గుర్తించి, పీ4 విధానంలో మార్గదర్శులు ద్వారా నిరుపేదలైన బంగారు కుటుంబాలను ఎంపిక చేసుకొని వారిని దత్తత తీసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు వారు ఆర్థికంగా, కుటుంబ పరంగా ఆశించిన స్థాయిలో ఆర్థిక, ఆరోగ్య పరిపుష్టిని సాధించేవరకు చేయూతనివ్వడం ముఖ్య ఉద్దేశమన్నారు. పీ4 విధానం ద్వారా బంగారు కుటుంబాన్ని ఎంపిక చేసుకొని ఆ కుటుంబంవారు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించి విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో ఆసరా ఇచ్చేందుకు ఆర్థిక పరిపుష్టి సాధించిన వారు మార్గదర్శులుగా ముందుకురావాలని సూచించారు. జిల్లాలో 86 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, ఇప్పటికే దాదాపు 3,700 మంది మార్గదర్శులు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎఫ్ఎల్వో మహిళా పారిశ్రామికవేత్తలు.. సామాజిక దృక్పథంతో నిరుపేదలను ఆదుకోవడం ద్వారా రాష్ట్రాభివృద్ధిలో తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం ఆశించిన ఫలితాల సాధనకు పీ4 విధానంలో భాగస్వాములై బంగారు కుటుంబాలకు ఆసరా అందించాలని కలెక్టర్ లక్ష్మీశ మహిళా పారిశ్రామికవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎఫ్ఎల్వో ప్రతినిధులు స్పందిస్తూ తమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో సమావేశాన్ని నిర్వహించి బంగారు కుటుంబాలను వ్యక్తిగతంగా, సంస్థ పరంగా ఎంపిక చేసుకొని అండగా నిలిచేందుకు తమవంతు కృషిచేస్తామని తెలిపారు. పేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు పీ 4 విధానం ఎంతో వినూత్నమైనదని.. ఇందులో భాగస్వాములు కావడం తమవంతు బాధ్యతగా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఎల్వో - విజయవాడ సీనియర్ వైస్ ఛైర్పర్సన్ సుప్రియా మాలినేని, సెక్రటరీ సుమబిందు అట్లూరి, ట్రెజరర్ తుల్జాభవానీ దేవినేని, జాయింట్ సెక్రటరీ దీప్తి చలసాని, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య పాల్గొన్నారు.

# స్ప్రీ ఆరోగ్య బీమా.. కార్మికుల జీవితాలకు మరింత ధీమా




- కార్మికుల సామాజిక భద్రత లక్ష్యంగా బీమా కవరేజీ విస్తరణ
- ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు

**విజయవాడ సెంట్రల్, జూలై 23 (మనం న్యూస్):** కార్మికుల సామాజిక ఆరోగ్య భద్రత లక్ష్యంగా నూతన స్ప్రీ ఆరోగ్య బీమా పథకంతో కార్మికుల జీవితాలకు ధీమా కల్పిస్తున్నామని.. ఈ పథకాన్ని కర్మాగారాలు, సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు కోరారు. బుధవారం విజయవాడ, గుణదలలోని సంస్థ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం (ఎస్ప్రీఆర్ఈఈ-2025) ప్రచార సామగ్రిని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక రాజ్య బీమా సంస్థ 196వ సమావేశంలో స్ప్రీ పథకానికి ఆమోదం లభించిందని, ఈ పథకాన్ని ఉపయోగించుకుంటూ కర్మాగారాలు, సంస్థలు స్వచ్ఛందంగా నమోదుకు ముందుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా యజమాని ప్రకటించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చెల్లుబాటయ్యేదిగా పరిగణించడం జరుగుతుందని, రిజిస్ట్రేషన్ ముందుకాలానికి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేదా ప్రయోజనం వర్తించదన్నారు. రిజిస్ట్రేషన్ ముందు కాలానికి ఎలాంటి తనిఖీ లేదా గత రికార్డుల కోసం డిమాండ్ చేయడం జరగదన్నారు. జరిమానాల భయాన్ని తొలగించడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళీకృతం చేసినట్లు వివరించారు. ఈ పథకం రాకముందు నిర్దిష్ట సమయంలోపు నమోదు చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు, పాత బకాయిల డిమాండ్ తలెత్తే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఈ స్ప్రీ పథకంతో ఆ అడ్డంకులు తొలగాయని, ఇప్పటివరకు నమోదుకాని కర్మాగారాలు, సంస్థలు తమ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈ పథకం వీలుకల్పిస్తోందని, త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 69,632 కర్మాగారాలు, సంస్థలు నమోదయ్యాయని, దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఈ పథకం కింద ఉన్నారని ఎం.రామారావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, స్టేట్ మెడికల్ ఆఫీసర్ డా. ఆర్.ప్రదీప్ కుమార్, కర్మాగారాల డైరెక్టర్ డి.చంద్రశేఖరవర్మ, బాయిలర్స్ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావు, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ నవనీత్ పాల్గొన్నారు.

# సహకార శాఖ అధికారులకు అవగాహన కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ, జూలై23 (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ మరియు సహకార శాఖ జిల్లా అధికారులకు సమాచార హక్కు చట్టం 2005 పై జిల్లా మండల గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాలు జరపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను పురస్కరించుకొని సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రీజినల్ ఆఫీసు సమావేశ మందిరంలో సమాచార చట్టం 2005 పై సహకార శాఖ అధికారులకు అవగాహన అవగాహన కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఫ్యాకల్టీగా మల్లికార్జున ప్రసాద్ వర్క్ షాప్ నిర్వహించారు. దీనిలో జిల్లా సహకార అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి అజిత కుమారి, విభాగ సహకార అధికారి కిరణ్ కుమార్ సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు సేవలు అందించేందుకు, సరైన సమాచారం త్వరితగతిన అందించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు.



# వీఎంసి విపత్తు నిర్వాహణ పై సమావేశం

**విజయవాడ పశ్చిమ, జూలై23 (మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కర్యాలయం లో గల నూతన భవనం లోని మీటింగ్ హాల్ లో విపత్తు నిర్వహణ పై వివిధ శాఖలతో, ఐసిఎల్ఇఐ ఆధ్వర్యంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెకట్స్ )డాక్టర్ డి. చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సమావేశం లో విపత్తు ఎన్ని విధాలుగా రావచ్చు, విపత్తు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి, విపత్తు సమయం లో ఎటువంటి చర్యలు తీసుకోవాలి, విపత్తు ఎదురుకున్న తరవాత ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి అంశాలు చర్చించారు. ఇతర రాష్ట్రలలో, దేశాలలో విపత్తు నిర్వాహణ ఎలా జరుగుతుంది, ఆ పద్ధతులు ఏ విధంగా మనకు అమలు చేయొచ్చు వంటి విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ గత సంవత్సరం తీవ్రమైన విపత్తును ఎదుర్కొందని, విపత్తు ఎప్పుడొస్తుంది ఎలాంటి పరిస్థితుల వల్ల వస్తుంది అన్న అంశాలు మనం చెప్పలేమని, కానీ విపత్తు ఎలా వచ్చినా విజయవాడ నగరపాలక సంస్థ పరిధి లో విపత్తు సమయంలో పునరావస కేంద్రాలు ఎక్కడున్నాయి, ఎవరిని సంప్రదించాలి వారికి సహాయానికి వచ్చే బృందాల నంబర్లు, అన్ని విషయాలు విపత్తు సంభవించే ప్రాంతాలకు తెలిపరిచినట్లు తెలిపారు. తద్వారా ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే వారిని వారు కాపాడుకునే చర్యలు కచ్చితంగా తీసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఏ. ఉమామహేశ్వరరావు, రోడ్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ ఇంచార్జ్ ఆర్. ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ బిజిఎల్ స్రవంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీసిపిడిసిఎల్ ఎం.వి.వి రామకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ ధనుంజయ్ రావు, వీఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- పనితీరు సరిగా లేని ఫీల్ అసిస్టెంట్లకు షోకాజు నోటీసులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

మొదటి పేజీ తరువాయి

**విజయవాడ సెంట్రల్, జూలై 23 (మనం న్యూస్):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శ్రామికులకు పని కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని.. ప్రతి మండలంలో పనితీరులో అట్టడుగున ఉన్న ముగ్గురు ఫీల్ అసిస్టెంట్లకు షోకాజు నోటీసులు జారీచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ పథకం, అనుబంధ కార్యకలాపాలపై డ్వామా అధికారులు, సిబ్బంది, ఆర్డీవోలు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రామికులకు రూ. 307 కనీస వేతనం కల్పించి ఆర్థిక ఊతం ఇచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. 2025-26కు గాను జిల్లాలో 80 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఈ నేపథ్యంలో గతేడాది గణాంకాల ఆధారంగా ఈ ఏడాది మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లాలో నాలుగువేల ఎకరాలలో ఉద్యాన పంటలను చేపట్టాలన్నది లక్ష్యం కాగా వారం రోజుల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మూడు వేల పంట కుంటలను నిర్మించాలనేది లక్ష్యం కాగా.. వీటిలో నిర్మాణ దశలో ఉన్నవాటికి సంబంధించి త్వరితగతిన పనులను పూర్తిచేయాలన్నారు. జల్ సంచాయ్ జన్ భాగీధరి కార్యక్రమం ద్వారా జిల్లాలో వాన నీటి సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాల ఫొటోలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని.. ఈ కార్యక్రమం అమల్లో జిల్లాను ముందువరుసలో నిలిపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో మంజూరైన వెయ్యి గోకుల షెడ్లకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించి, పరిపాలన అనుమతులకోసం ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్లో డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ,వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లో ఎటువంటి మరమ్మతులు ఉండరాదు

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ, జూలై23 (మనం న్యూస్):** నగర పరిధిలో గల అన్న క్యాంటీన్లలో ఎటువంటి మరమ్మత్తులు ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం బుధవారం సాయంత్రం గాంధీజీ మహిళా కళాశాల వద్దగల అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లో విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే సౌకర్యాలలో ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని, ఎక్కడ మరమ్మతులు వచ్చినా వెంటనే పూర్తి చేసి ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, ఎటువంటి నిర్మాణ మరమ్మతులైన త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతిరోజు నోడల్ ఆఫీసర్లు తమ తమ అన్న క్యాంటీన్లను పరిశీలించి ఎటువంటి మరమ్మత్తులు లేకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, ఆహారంలో నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ కచ్చితంగా ఉండేటట్టు చూసుకోవాలని అన్నారు.

# వీఎంసి ఆఫీసులో ఆర్వోయువి ఆటో వాటర్ ప్లాంట్

**విజయవాడ పశ్చిమ, జూలై23 (మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ ధ్యానచంద్ర హెచ్ ఎం అదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో రివర్స్ ఆస్మోస్ అల్ట్రా వైలెట్ ఆటో వాటర్ ప్లాంట్ ను బుధవారం సాయంత్రం టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ ఎంప్లాయిస్ కోసం త్రాగునీటి సౌకర్యానికి ఆరో ప్లాంట్ కావాలని యూనియన్ సభ్యులు కోరగా వెంటనే కౌన్సిల్లో పెట్టి త్వరగా మంజూరు చేయించి అధికారుల సహకారంతో ఆరో ప్లాంట్ వచ్చినందుకు తమకెంతో సంతోషంగా ఉందని, ఎంప్లాయి ల కోసం ప్రజల కోసం తాము ఎప్పుడు వెనకాడమని తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ రివర్స్ ఓస్మోసిస్ అల్ట్రా వైలెట్ ఆటో వాటర్ ప్లాంట్ 5 లక్షల వ్యయంతో, 1 గంటకు వెయ్యి లీటర్ల సామర్థ్యం గలదని, ప్రత్యేకించి వర్షాలు కాలం లో ఎటువంటి బాక్టీరియా రాకుండా అల్ట్రా వాయిలెట్ కాపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దారా రాంబాబు, సెక్రటరీ సింహాచలం మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎంప్లాయిస్ కొరకు ప్రత్యేకంగా త్రాగునీటి సౌకర్యానికై ఒక ఆర్ ఓ ప్లాంట్ అవసరమని గుర్తించి, వారి సమస్యను తెలియపరచగా టిడిపి ఫ్లోర్ నెలిబండ్ల బాలస్వామి ప్రతిపాదనతో కౌన్సిల్ ఆమోదం పొందిన పిమ్మటే అధికారులు త్వరగా ఆర్ ఓ ప్లాన్ ను, విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారని అన్నారు. అందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సుబ్రహ్మణ్యం, పి. సత్యకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సురేఖ, శ్రీనివాస్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మనస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ బుద్ద రాజా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్మనీష్ ను కలిసిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జులై 23 మనం న్యూస్:** జగ్గయ్యపేట నియోజకవర్గంలో వాహనాల ఫిట్నెస్ విషయంలో యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ట్రాన్స్పోర్ట్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాను కలసి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ వివరించారు. గతంలో రవాణా మంత్రిని కలిసి సమస్యలను వివరించిన తాతయ్య , ఈసారి ట్రాన్స్పోర్ట్ కమిషనర్కు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం జగ్గయ్యపేట నుండి విజయవాడ నున్న వరకూ వెళ్లాల్సిన అవసరం వల్ల వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు వివరించారు. డ్రైవర్ల జీతాలు, ఆయిల్ ఖర్చులు, సమయ నష్టంతో పాటు దీని వల్ల ప్రజలకు ఆర్థిక భారమైతుందని వివరించారు.ఈ అంశాన్ని గమనించిన కమిషనర్ స్పందిస్తూ, ఇది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టు అయినప్పటికీ సంబంధిత అధికారులతో చర్చించి త్వరలో జగ్గయ్యపేటలోనే ఫిట్నెస్ సర్టిఫికేట్ సెంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతవరకూ తాత్కాలికంగా ట్రాక్టర్లు మరియు ఆటోలు కోసం జగ్గయ్యపేటలోనే ఫిట్నెస్ సర్టిఫికేట్ ప్రక్రియ పూర్తి చేయడానికి అనుమతులు ఇస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ స్పందిస్తూ, 'ప్రజల ఇబ్బందులు గమనించి వెంటనే స్పందించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రజా సంక్షేమమే నా ప్రథమ లక్ష్యం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, పలువురు ట్రాన్స్పోర్ట్ నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పొలం పిలుస్తోంది




**వీరులపాడు, 23జూలై (మనం న్యూస్):** పొన్నవరం మరియు నరసింహారావుపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతులకు ఖరీఫ్ 2025 పంటల బీమాలో భాగంగా మొక్కజొన్న,పెసర మరియు ఎండు మిరప పంటలకు తప్పనిసరిగా ఈ నెల 31 లోగా ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకంలో నమోదు కావలిసిందిగా తెలియజేయడమైనది మరియు పంట నమోదు అవశ్యకత, పీఎం ప్రణం లో భాగంగా రైతులకు ఎరువుల వినియోగం తగ్గించి నానో యూరియా మరియు నానో డి ఎ పి,జీవన ఎరువుల వాడకం ప్రోత్సహించడం ద్వారా నేల సంరక్షణ మరియు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు అని వివరించడం జరిగింది,సబ్సిడీ లో అందుబాటులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు,రైతులకు సబ్సిడీ మీద తైవాన్ స్ప్రేయర్,ట్రాక్టర్ పరికరాలు మరియు కిసాన్ డ్రోన్ల గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుభాని, డి హెచ్ ఒ బాలాజి, వెటర్నరీ డి డి వెస్లి, ఎం ర్ ఓ పి.రవి కుమార్, ఎం ఎ ఒ బి.జోగేంద్ర ప్రసాద్ మరియు వి ఎ ఎ లు గోపి,అనూష మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# నారీ శక్తులకు ఆయుధంగా శక్తి యాప్



**మచిలీపట్నం జులై 23(మనం న్యూస్):** నిత్యం వినియోగదారుల తో రద్దీగా ఉండే మచిలీపట్నం డీమార్ట్ మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ పై మచిలీపట్నం మహిళ పోలీస్ స్టేషన్ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం డీమార్ట్ మహిళా వినియోగదారులకు, సిబ్బందికి శక్తి యాప్ డౌన్లోడ్ చేయించారు.ఈ సందర్భంగా ప్రతి మహిళ శక్తి యాప్ ను కలిగి ఉండాలని పోలీసులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ముఖ్యంగా మహిళలతో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేయించి దాని ఉపయోగాన్ని తెలిపారు. ఆపద సమయంలో మహిళలు శక్తి యాప్ ను ఉపయోగించి రక్షణ పొందవచ్చు అని తెలిపారు. అత్యవసర సమయంలో శక్తి యాప్ ను మహిళలు ఉపయోగించుకోవాలని పోలీసులు కోరారు.

# బాబు పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు

- మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రవీణ్



**ఉయ్యూరు,జులై 23(మనం న్యూస్ ):** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు రూరల్ మండలం గండిగుంట పంచాయతీ ఆనందపురం గ్రామంలో పర్యటించిన ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండా ప్రవీణ్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్ళి ముఖ్యమంత్రి చంద్రబాబు , లోకేష్ బాబు , పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సహకారంతో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పై మహిళలు వృద్ధులను పలకరిస్తూ... కూటమి ప్రభుత్వ సంవత్సరంకాల పాలనపై అభిప్రాయం అడగగా ప్రజలందరూ స్పష్టంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ కోటేశ్వరరావు, పాలడుగు చందు, బూత్ కన్వీనర్లు బాషా, శేఖర్, రత్నవేణి, సాయి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు

# మాన్సూన్ రెస్పాన్స్ టీం మూడు షిఫ్ట్ లలో విధులు నిర్వహించాలి

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం



**విజయవాడ పశ్చిమ, జూలై23 (మనం న్యూస్):** ఎమినిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలతో ఏర్పాటుచేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీం మూడు షిఫ్ట్ లలో విధులు నిర్వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, రథం సెంటర్, బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, బెంజ్ సర్కిల్ నుండి రామవరప్పాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాన్సూన్ రెస్పాన్స్ టీం తమ తమ పాయింట్లలో ఉదయం 6 గంటలకు మొదలై మూడు షిఫ్ట్ లలో విధులు నిర్వహించాలని, వర్షం వచ్చినా రాకపోయినా ఖచ్చితంగా మాన్సూన్ రెస్పాన్స్ టీం తమ తమ పాయింట్లు విధులు నిర్వహించాలని, వర్షం వచ్చిన వెంటనే పది నిమిషాలలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి టీం తమ వద్ద నీటి నిల్వలు తీసేందుకు అవసరమైన పరికరాలు ముందుగానే సమకూర్చుకోవాలని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, అధికారులను ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, చీఫ్ సిటీ ప్లానర్ ముగ్గురు సమన్వయంతో మాన్సూన్ రెస్పాన్స్ టీం సమర్థవంతంగా పనిచేయాలని, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి నోడల్ ఆఫీసర్గా వ్యవహరించాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# దేవరమ్మ తల్లి సాక్షిగా...బహిరంగ చర్చకు సిద్ధమా




**ఉయ్యూరు, జులై 23 (మనం న్యూస్):** టిడిపి నాయకుల అరాచకాలు బట్టబయలు చేసిన దేవరమ్మ తల్లి సాక్షిగా నేను సిద్ధం మీరు సిద్ధమా అంటూ ఆ పార్టీ నాయకులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ విసిరారు. మండలంలోని చిన్నోగిరాల లో వైసీపీ నాయకురాలు పాలడుగు శివ జ్యోతి నివాసంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణా జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పాలకు శివజ్యోతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామినేని రమాదేవి, వైసిపి కంకిపాడు మండల కమిటీ అధ్యక్షురాలు మాదు శ్రీహరి రాణి ,రైతు విభాగ నాయకులు దోనేపూడి సాంబశివరావులు మాట్లాడారు. టిడిపి నాయకులు వైసిపి నేతలను విమర్శిస్తూ మంగళవారం మార్కెట్ యార్డ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడటాన్ని పూర్తిగా ఖండించారు. వైసిపి అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన నిలిచే పార్టీ అన్నారు .నియోజకవర్గ వైసీపీ నేత దేవ భక్తుని చక్రవర్తి పై అవార్తులు చావాకుల పేలిన టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజలు ప్రతిపక్ష పార్టీలు అధికార పక్షాన్ని నిలదీసే హక్కు ఉందన్నారు. ఈ క్రమంలో టిడిపి ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తే తప్పేంటని ప్రశ్నించారు. చిన్న ఓగిరాల్లో టిడిపి నాయకులు చేస్తున్న అరాచకాలకు అద్దెలవకుండా పోయిందన్నారు. అవినీతి అక్రమాలకు అడ్డాగా టిడిపి నేతలు పనిచేస్తున్నారని వారి బాగోతాన్ని బట్టబయలు చేసేందుకు వైసిపి సిద్ధంగా ఉందన్నారు. వాస్తవాలను బయట పెట్టేందుకు గ్రామ దేవత దేవరమ్మ తల్లి సాక్షిగా నేను సిద్ధంగా ఉన్నానని మీరు సిద్ధమా అంటూ పాలడుగు శివజ్యోతి సవాల్ విసిరారు. టిడిపి నేతల గుండెల్లో దమ్ము ధైర్యం ఉంటే చిన్న ఓగిరాల్లో అమ్మవారి ఎదుటే ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు . శివ జ్యోతి మెరుపుతీగ అంటూ.. వ్యాఖ్యానిచ్చిన ఓటమి నాయకుడికి గట్టిగా బుద్ధి చెప్పారు 'మెరుపుతీగను కాదు.. కరెంటు తీగను 'జాగ్రత్త అంటూ హెచ్చరించారు. గుణదల దొడ్డి రాజకీయమని వ్యాఖ్యలు చేయడం సరికాదు అన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సైతం అదే గుణదల దొడ్డిలో దేవినేని నెహ్రూతో కలిసి పనిచేశారని గుర్తు చేశారు. దీనికి తోడు వైసిపి నుండి వీడిన అనేకమంది ఎమ్మెల్యేలను మాజీ ప్రజా ప్రతినిధులను టిడిపిలో చేర్చుకున్న మీరు నీతులు వల్లించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో పార్టీ నేత దేవాభక్తుని చక్రవర్తి కు లభిస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక టిడిపి వర్గీయులు అసత్య ప్రచారాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంతో పాటు చిన ఓగిరాల్లోనూ రెడ్ బుక్కు రాజ్యాంగం అమలు చేయడం సరికాదన్నారు. నాడు ఏ రాజకీయ భవిష్యత్తు లేక కోపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంట్ నియామకం కోసం మా దగ్గర చేతులు చాచిన కుటుంబరావు ఎన్నో అరాచకాలకు పునాదులు వేశారని వాటన్నింటినీ బట్టబయలు చేసేందుకు వైసిపి సిద్ధంగా ఉందన్నారు. టిడిపి నేతలకు నిలువరించ గలిగే దమ్ము ధైర్యం ఉంటే సవాలకు సిద్ధం కావాలన్నారు. లేఖల సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఉదయభాను, రాజేశ్వరి ,సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయం మంజూరు

- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**మైలవరం జులై 23 మనం న్యూస్:** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. స్థానిక మండలం వెల్వడం గ్రామానికి చెందిన బెల్లంకొండ రమణయ్య, వేముల లలిత కుమారి, వెల్లంకి కృష్ణ కి సి ఎమ్ ఆర్ ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. వీరికి సంబంధించిన చెక్కులను శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు పట్టణంలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో అందజేశారు. చెక్కులతో పాటు సీఎం చంద్రబాబు సందేశ పత్రాలను కూడా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వారికి అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో వెల్వడం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రత్తిపాటి ప్రభాకర్, సెక్రటరీ గుంజి రాంప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, పొదిలి రోశయ్య, గుంజి అంజిబాబు, వేముల నాగరాజు, ప్రత్తిపాటి కిరణ్, కొమ్మిరి కృష్ణ బాబు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించిన మాజీ మంత్రి



**విజయవాడ రూరల్, జూలై 23, మనం న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధులైన లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ ల జయంతి కార్యక్రమాన్ని బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గొల్లపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, 'బాలగంగాధర్ తిలక్ 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనే నినాదంతో స్వాతంత్ర్య ఉద్యమంలో జాతీయ భావనను రగిలించారు. అలాగే, చంద్రశేఖర్ ఆజాద్ తన అపూర్వమైన ధైర్యంతో యువతకు స్ఫూర్తిగా నిలిచారు. వీరిద్దరూ భారత స్వాతంత్ర్య పోరాటంలో చిరస్థాయిగా నిలిచే సేవలు అందించారు. వారి ఆశయాలను ఈ రోజు మనం స్మరించుకోవాలి మరియు దేశ పురోగతి కోసం కృషి చేయాలి,' అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సుజనా చౌదరి పై వైసీపీ నేత మహేష్ వ్యాఖ్యలపై కూటమి కార్పొరేటర్ల ఆగ్రహం



**విజయవాడ పశ్చిమ, జూలై 23 (మనం న్యూస్):** పశ్చిమ నియోజకవర్గం 45 వ డివిజన్ సితార సెంటర్ లో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు పై పోతిన మహేష్ చేసిన వ్యాఖ్యలను విజయవాడ పశ్చిమ నియోజక వర్గానికి చెందిన కూటమి కార్పొరేటర్లు ఖండించారు. వాస్తవానికి ఈ ఫుడ్ కోర్ట్ కు రెండేళ్ల క్రితమే అనుమతులు వచ్చాయని, అప్పుడు అనుమతులు వచ్చిన సమయంలో అధికారంలో ఉన్నది వైసీపీ ప్రభుత్వమేనని వారు స్పష్టం చేశారు. గతంలోనే అక్కడ నేషనల్ హైవే ను ఆనుకొని అనధికారికంగా అడ్డగోలుగా చాలామంది వ్యాపారాలు చేసి అక్రమాలకు పాల్పడిన విషయం పోతిన మహేష్ తెలుసుకోవాలన్నారు. అలాంటి వారి నుంచి పోతిన మహేష్ కు ఏమైనా ముడుపులు అందాయేమో ఆయనకే తెలియాలని అన్నారు. అభివృద్ధి ని అడ్డుకోవడం కోసమే పోతిన మహేష్ లాంటి వాళ్ళు ఆ ఫుడ్ కోర్ట్ లు, బార్ లు, మందు షాప్ లకు మంచింగ్ కోసం అని నోటిదురుసు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టి పెట్టారని తెలిపారు. అక్కడ రోడ్డు విస్తరణ, డ్రెయిన్లు మరమత్తులు చేయాల్సి ఉంది కాబట్టి వాటి మీద కూడా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారన్నారు. సుజనా చౌదరి ది కేవలం అభివృద్ధి మంత్రమే తప్ప వైసీపీ నాయకుల మాదిరిగా నీచ రాజకీయాలు చేయరన్న విషయం ప్రజలందరికీ తెలుసనని దీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమంలోనూ వైసీపీ ప్రజాప్రతినిధులను కూడా భాగస్తులు కావాలని కోరడం ఆయన హుందాతనం అని తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే పోతిన మహేష్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే సుజనా చౌదరి పై ఇష్టారాజ్యంగా నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, మైలవరపు మాధురి లావణ్య , మరుపిళ్ళ రాజేష్, అత్తలూరి ఆదిలక్ష్మి పెద్దబాబు, మైలవరపు రత్నకుమారి దుర్గారావు, మహాదేవు అప్పాజీరావు, టీడీపీ సీనియర్ నేత మైలవరపు కృష్ణ పాల్గొన్నారు

# నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

- **ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు**

**ఇబ్రహీంపట్నం, జూలై 23 (మనం న్యూస్):** నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు అన్నారు. వర్షాల వల్ల ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలను ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు బుదవారం నాడు పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణ నది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు. బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి కృష్ణా నది పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అదేవిధంగా లాంచి ప్రయాణం నిలిపివేయాలని ఆదేశించారు. కృష్ణానది సమీపంలోని ఇళ్లల్లో ప్రజలు, లంక ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ ఇన్ స్పెక్టర్ మనోజ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

# విజయవాడలో బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

మొదటి పేజీ తరువాయి



**విజయవాడ సెంట్రల్, జూలై 23 (మనం న్యూస్):** విజయవాడ మొగల్రాజ్ పురం సిద్దార్థ కాలేజీ ఆడిటోరియంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు ఆదివారం రాత్రి 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం అద్భుతంగా ప్రదర్శించారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా నాటకం చూసేందుకు వందల మంది వచ్చారు. ముఖ్యంగా ఒక్క మంగళగిరి నుంచే ముందుగా అనుకుని సుమారు 70 మంది వచ్చారు. 2.20 గంటల నాటకం ఆద్యంతం అద్భుతంగా ప్రదర్శించారు. బుద్ధుడితో అంబేద్కర్ ప్రయాణం ఇది. నాటకంలో బౌద్ధాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో ఆవిష్కరించారు. వేదికపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నటీనటులు అందరూ చక్కగా నటించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, కామ్రేడ్ జీఆర్కే - పోలవరపు సాంస్కృతిక సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో అభ్యుదయ ఆరట్స్ అకాడమీ వారు ప్రదర్శించిన ఈ నాటకం తెలుగు నేలపై సామాజిక, రాజకీయ, తాత్విక కోణాలను స్పృశిస్తూ, బుద్ధుడు, అంబేద్కర్ గురించి, వాళ్ళు సమాజం కోసం పడిన తపన గురించి, సమాజానికి వారు చూపించిన సార్వకాలికమైన సత్యాలను, వారి జీవితాల్లో జరిగిన పలు సంఘటనలను సంగీత, సాహిత్య సమ్మేళనంతో నిండిన గొప్ప కళారూపం. అత్యంత ఆధునిక సాంకేతిక, సౌండ్, అండ్ లైటింగ్ విధానాలతో ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా 30 మంది కళాకారులు రెండు గంటల సేపు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు, జాతీయ కార్యదర్శి వై.కొం డలరావు తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు. మంగళగిరి నుంచి మంగళగిరి బుద్ధ విహార చైర్మన్ రేకా కృష్ణార్జునరావు, ఆంధ్ర నాటక కళా సమితి రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబతుని లక్ష్మణరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ నూర్ బాషా, మానవతా వేదిక కన్వీనర్, ప్రముఖ కవి గోలి మధు, మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయ రావు, ప్రముఖ గాయకులు కంచర్ల కాశయ్య, బుద్ధభూమి వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య, అభ్యుదయ కవి, నటులు సందుపట్ల భూపతి, కరాటే మాస్టర్ కొడాలి రవి, స్నేహ మహిళా మండలి కార్యదర్శి వల్లభనేని వాణీ తదితరులు వచ్చారు.

పామర్రు టౌన్ ఎన్టీఆర్ సర్కిల్‌లో డిప్యూటీ సిఎం శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా ప్రమోషన్ నిర్వహించిన పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజావారితోపాటు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

- పామర్రు, మనం న్యూస్




# ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర తిలక్ జయంతి వేడుకలు



**మైలవరం జులై 23 మనం న్యూస్:** స్థానిక లకి రెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర తిలక్ జయంతి వేడుకలను కళాశాల యన్.యస్.యస్. యూనిట్ మరియు ఎన్.సి.సి వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ కె.అప్పారావు, మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ మరియు బాలగంగాధర తిలక్ పోరాట ప్రతిభ ప్రతి ఒక్కరికి ఆదర్శం అని, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారని బ్రిటీష్ వారి నుండి భారతదేశానికి విముక్తి కలగాలంటే శాంతి, అహింస మార్గాలే కాదు సాయుధ పోరాటం కూడా చేయాలని అప్పుడే మనకు స్వాతంత్ర్యం వస్తుందని బలంగా నమ్మిన వ్యక్తి అని అలాగే ఆంగ్లేయుల చెర నుండి భారతదేశాన్ని సైనికరీతిన పోరాడి స్వాతంత్ర్యం సంపాదించాలనే ఉద్దేశంతో భారతీయులను సైనికులుగా తీర్చిదిద్దిన స్వాతంత్ర సమరయోధులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.రమేష్ రెడ్డి, మాట్లాడుతూ బాలగంగాధర తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు, దానిని నేను సాధిస్తాను' అని తిలక్ నినదించారు. ఇది ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించింది అని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో యన్.యస్.యస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శివహరి ప్రసాద్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, మరియు యన్.యస్.యస్.ప్రోగ్రాం అసిస్టెంట్ ఆఫీసర్ ఎస్ .ఉమామహేశ్వర రెడ్డి . ఎన్.సి.సి కో ఆర్డినేటర్ ఆర్.పవిత్ర పాల్గొన్నారు.

# ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు



**ఉయ్యూరు,జులై 23 (మనం న్యూస్):** ట్రూ అప్ చార్జీల పేరుతో ఒకపక్కన బాదుడు స్మార్ట్ మీటర్ల బిగింపుతో సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపి ప్రజా వ్యతిరేక విధానాలను నేటి ప్రభుత్వం అవలంబిస్తుందని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శివ నాగేంద్రం అన్నారు. బుధవారం స్మార్ట్ విద్యుత్ మీటర్ల ను వ్యతిరేకించాలి అనే అంశంపై శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. బడా కార్పొరేట్ సంస్థలైన అదాని అంబానీ లాంటి సంస్థలకు తలవొగ్గి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాలన్నీ మోపుతున్నాయని ఆయన అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించి గంటల వ్యవధిలో అనేక స్లాబులు రూపకల్పన చేసి ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా వ్యూహరచన చేశారని దీనిని అందరూ వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఆగస్టు 5న విద్యుత్ ట్రూ అప్ చార్జీలు బాదుడుకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డగించాలని తమ నిరసన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు బి రాజేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ సహాయ కార్యదర్శి బి కీర్తి సీనియర్ నాయకులు తుమ్మల చంద్రమౌళి, కెవిపిఎస్ నాయకులు నెమ్మది గోపాల్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలపాల రవి ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కస్తూరి సత్యవతి తాహెరా మహిళా సంఘం నాయకురాలు నెమ్మది నాగమణి పాల్గొన్నారు.

# రహదారి అభివృద్ధికి శంకుస్థాపన ఎమ్మెల్యే

**మైలవరం, జులై 23 మనం న్యూస్:** స్థానిక మండల పరిధిలోని మొర్సుమిల్లి నుంచి తండాకు వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.1.68 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 3.2 కిలోమీటర్ల పొడవునా రహదారిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఎంతో కాలంగా రోడ్డు గోతులమయంగా మారగా ప్రజలు, వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రజల ఇబ్బందులు అన్నీ తొలగిపోతాయన్నారు. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కి ఘనస్వాగతం లభించింది. గ్రామస్తులు హారతులు ఇచ్చి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

